క్లుప్తంగా

తపాలా ఉద్యోగుల సమ్మె



తిరువూరు: తమ సమస్యల పరిష్కారానికి తిరువూరు డివిజన్లో తపాలా శాఖ ఉద్యోగులు బుధవారం సమ్మె నిర్వహించారు. ఎనిమిది గంటల పనివిధానం, పెన్షన్‌తో పాటు అన్ని ప్రయోజనాలు అమలు చేయడం, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలకు పెంపు, గ్రాట్యుటీ రూ.5లక్షలు చెల్లింపు తదితర డిమాండ్ల సాధనకు ఈ సమ్మె చేసినట్లు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు తెలిపారు. డివిజన్లోని జీడీఎస్ సిబ్బంది తిరువూరు సబ్ పోస్టాఫీసు ఎదుట ధర్నా చేశారు. యూనియన్ నాయకులు బీ లక్ష్మణరావు, ఎస్. కుమారి నాయకత్వం వహించారు.

విత్తన ఉత్పత్తిలో మెలకువలు పాటించాలి



చంద్రుపట్ల (విస్సన్నపేట): విత్తన ఉత్పత్తిలో తగిన మెలకువలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డీఆర్పీ వ్యవసాయాధికారి సత్యవతి అన్నారు. మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా రైతులకు ఎంటీయూ 1061 ఫౌండేషన్ విత్తన ఉత్పత్తి జన్యు స్వచ్ఛత, విత్తన తేమ, మొలక శాతంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.బాలకొండయ్య, ఏఓ రాజ్యలక్ష్మి, వీహెచ్‌ఏ కీర్తి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు



నూజివీడు: యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పీజీ సెంటర్‌లో యోగా ఉచిత తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ వేదకాలం నుంచి భారతదేశంలో యోగా అనేది ఉందని, దీని ద్వారానే వేల ఏళ్ల క్రితం ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారన్నారు. యోగాను ప్రపంచానికి పరిచయం చేసిందే భారతీయులని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వంగల గోవిందరావు, శిక్షకురాలు వీరమాచినేని లీలాకుమారి, యోగా తరగతుల కన్వీనర్ రంగారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య, కేవీ శేషయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నాగేంద్రకు ఘన నివాళి



చాట్రాయి: యువకుడు దాడి చేసిన సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ గంధం నాగేంద్రకు బుధవారం రాత్రి పోలీసులు, ప్రజలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాట్రాయి సెంటర్లో కొవ్వొత్తులు వెలిగించి అమర్ రహే నాగేంద్ర అంటూ నినాదాలు చేశారు. ఎస్సై స్వామి పాల్గొన్నారు.

7న మెగా పాస్‌పోర్ట్ మేళా

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 7న ఫ్రీ మెగా పాస్‌పోర్ట్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం పరిసర ప్రాంతాల విద్యార్థులు, విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇది సదావకాశమని, 7న కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఒరిజినల్ స్కాన్డ్ కాపీ, ఆధార్ కార్డు ఒరిజినల్ స్కాన్డ్ కాపీ రూ.1,500 ప్రాసెసింగ్ ఫీజ్ తీసుకుని రావాలని ప్రి న్సిపాల్ తెలిపారు. ఇతర వివరాలకు 08659-2 99992లో సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): న్యాయవాదుల ఇళ్లపై ఎన్‌ఐఏ సోదాలు చేయడాన్ని ఖండిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. బీబీఏ అధ్యక్షుడు కేవీ సుందర్ మాట్లాడుతూ పౌరుల న్యాయం కోసం నిలబడే న్యాయవాదుల ఇళ్లపై ఎన్‌ఐఏ అధికారులు దాడులు, సోదాలు చేయడం సెక్షన్ 100, 160, 165, 41డీ ప్రకారం నిబంధనలను ఉల్లంఘించడమే అని పేర్కొన్నారు.

అందరికీ ఆరోగ్యం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



గంపలగూడెం మండలం కనుమూరులో రోగులకు మందుల కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



ఆగిరిపల్లిలో హోమియో ఆస్పత్రిని సందర్శిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

కనుమూరు(గంపలగూడెం): ప్రజలందరికీ ఆరోగ్యం చేకూర్చాలన్న సంకల్పంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. గంపలగూడెం మండలం కనుమూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గ్రామీణప్రాంత ప్రజలు వైద్యసేవలు అవసరమైన సమయంలో మండల, డివిజన్, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులను పడేవారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులను తొలగించాలను ఆలోచనతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆచరణలోకి తెచ్చారన్నారు. శిబిరంలో 1,050 మందిని వైద్యులు పరీక్షించినట్లు గంపలగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శృతి తెలిపారు. రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సర్పంచ్ మందా మారేశ్వరి, ఉప సర్పంచ్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పగడాల రాజేశ్వరి, సొసైటీ అధ్యక్షులు చెరుకు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వజ్రాల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జీ చెన్నకేశవరెడ్డి, బొల్లా కరుణాకరరావు, జీ శ్రీనివాసరెడ్డి, అత్తునూరు పద్మారెడ్డి, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాల కృష్ణారెడ్డి, సీడీపీఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి పెద్దపీట

నూజివీడు (ఆగిరిపల్లి): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లిలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ముంగిటకే కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నారన్నారు. వైద్య శిబిరంలో అందించే వైద్య సేవలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక రోగులకు అవసరమైతే విజయవాడ, హైదరాబాద్‌లలోని ఆస్పత్రులకు పంపి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సను అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 388 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జాస్తి జగన్మోహన్‌రావు, ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు పావనజ్యోతి సుజనకుమారి, మండల ప్రత్యేకాధికారి వెంకటరత్నం, ఎంపీడీఓ శంకర రావు, తహసీల్దార్ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

హోమియో ఆస్పత్రి అభివృద్ధికి కృషి

ఆగిరిపల్లిలోని హోమియో ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ను హోమియో వైద్యురాలు రజిత భవనానికి మరమ్మతులు చేయించాల్సి ఉందని, దీనికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రతాప్ ఏలూరులోని ఆయుష్ శాఖ జిల్లా ఉన్నతాధికారితో మాట్లాడి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూ.3 లక్షలను మంజూరు చేస్తున్నట్లు, మరమ్మతులను చేపట్టవచ్చని ఎమ్మెల్యేకు తెలిపారు. ఇంకా ఏమైనా నిధులు కావాలన్నా తన దృష్టికి తీసుకొస్తే నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రజల వద్దకే వైద్యం

జి.కొండూరు: గడప వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చెవుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావుతో కలిసి ఎంపీపీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ఎంపీపీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, తహసీల్దార్ రోహిణీదేవి, వైద్యాధికారులు డాక్టర్ శిరీష, శ్వేత, పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు పాల్గొన్నారు.

గుంటుపల్లిలో..

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) అనురాధ అన్నారు. గుంటుపల్లి సచివాలయం-2 పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఆమె బుధవారం పాల్గొన్నారు. జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరం జరుగుతున్న తీరు, మందుల నాణ్యత పరిశీలించారు. పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో 526మందికి బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్, మలేరియా, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, గ్రామ సర్పంచ్ భుక్యా కవిత, డాక్టర్లు మసూద్, గౌస్, సౌమ్య, వర్షిణి, ఎంఈఓ-2 శ్యామ్‌బాబు, ఈఓపీఆర్డీ మనోజ్, సీహెచ్‌ఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, సీడీపీఓ పుష్పలత, రమాదేవి పాల్గొన్నారు.

మల్లేలో..

మల్లేల(తిరువూరు): ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణ నిధి అన్నారు. మండలంలోని మల్లేలలో బుధవారం జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. మల్లేల గ్రామ సర్పంచ్ మరియమ్మ, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కలకొండ రవికుమార్, ఏఎంసీ ఛైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైద్యారోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

ఏ.కొండూరు: పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా పేర్కొన్నారు. మండలంలోని ఏ.కొండూరు తండాలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూక్య సావిత్రి, భూక్య ఝాన్సీ, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, వైద్యాధికారి స్వాతి పాల్గొన్నారు.

ప్రజల చెంతకు వైద్య సేవలు

చాట్రాయి: ప్రజల చెంతకు వైద్య సేవలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయమని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్లు అరవింద్(జనరల్), భాను ప్రకాష్(ఆర్థోపెడిక్) విజయలక్ష్మి, జ్యోతి దుర్గా ప్రసాద్ తదితరులు 202 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

తాతకుంట్ల (విస్సన్నపేట): ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని తాతకుంట్ల గ్రామ సచివాలయం పరిధిలో స్థానిక ఎంపీయూపీ పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని పరిశీలించిన జెడ్పీటీసీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి రావు, విస్సన్నపేట సర్పంచ్ నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని వైస్ ఎంపీపీ రాజానాయన అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన బుధవారం చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్‌కుమార్, ప్రవీణ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎడ్విన్ రాజ్ 501 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, పుష్పవతి, సర్పంచ్ రాధిక, వైస్ సర్పంచ్ పద్మజ, తహసీల్దార్ డి.సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఏ.కొండూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



ముసునూరు మండలం చెక్కపల్లిలో దివ్యాంగుడికి వైద్య పరీక్షలు



చెవుటూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న నాయకులు



గుంటుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ అనురాధ



తిరువూరు మండలం మల్లేలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే రక్షణనిధి



ఆరుగొలనుపేటలో జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరం



విస్సన్నపేట మండలం తాతకుంట్లలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ లోకేశ్వరరెడ్డి

జెడ్పీ పాఠశాల టీచర్‌పై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి జెడ్పీ పాఠశాల పీడీ (ఫిజికల్ డైరెక్టర్) బి.నాగమణి, ఆమెకు సహకరించిన విలేకరిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి పి.తులసి బుధవారం ఫిర్యాదు చేశారు. తమ కుమార్తె భవానీదుర్గశ్రీ జెడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండగా డ్రిల్ టీచర్ నాగమణి తన కుమార్తెతో ప్రతిరోజు పాఠశాల అయిన తర్వాత ఆరు గంటల వరకు మసాజ్, తదితర వ్యక్తిగత పనులు చేయిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతిరోజు ఇంటికి ఆలస్యంగా రావడంపై ఆరా తీయగా విషయం బయటపడినట్లు చెప్పారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు దృష్టికి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో గతంలో తీసుకువెళ్లగా ఆయన విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీవైఈఓ వెంకటప్పయ్య, ఎంఈఓ-2 శ్యామ్‌బాబు విచారణ జరిపారు. ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో పీడీతో పాటు ఆమె తరఫున ఓ టీవీ చానల్ రిపోర్టర్ తనపై ఒత్తిడి తెచ్చి ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేయడంతో పోలీసులను ఆశ్రయించినట్లు ఆమె తెలిపారు. తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్

తిరువూరు: విద్యార్థులు సరదా కోసం తోటివారిని ర్యాగింగ్ చేసినా శిక్షార్హులవుతారని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ అన్నారు. తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో మెలగాలని, సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి దశలో ఎటువంటి తప్పటడుగు వేసినా భవిష్యత్ అంధకారమయం అవుతుందన్నారు. ఉపాధి అవకాశాలు కోల్పోతారని జడ్జి తెలియజేశారు. బార్ అసోసియేషన్ చైర్మన్ సంకురాత్రి జనార్దనరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏపీపీ బడేమియా, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి అంజన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎస్టీవీఆర్ విద్యార్థి



కార్తీక్‌ను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన 8వ సబ్ జూనియర్స్ స్టేట్ చాంపియన్ షిప్‌లో దుర్గాపురం ఎస్టీవీఆర్ నగర పాలకసంస్థ పాఠశాల విద్యార్థి పట్నాన కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో కార్తీక్‌ను పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎంజీపీ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎస్వీ శ్యామ్ ప్రసాద్, ఆంగ్ల ఉపాధ్యాయురాలు కె.రాణి కలిసి కార్తీక్‌కు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎండీ ఇమ్రాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ ఎన్టీఆర్ జిల్లా జట్టుకు..

దుర్గాపురం ఎస్టీవీఆర్ పాఠశాల విద్యార్థులు బి. హేమేంద్ర, పి. తనోజ్‌కుమార్, బి. రామ్‌చరణ్ ఎన్టీఆర్ జిల్లా షూటింగ్ బాల్ బాలుర జట్టుకు ఎంపికయ్యారు. అలాగే బాలికల విభాగంలో జి.రమ్య, పి.లలిత షేక్ కరిమున్నీసా, ఆర్.మానస ఎంపికయ్యారు. ఈ జట్లు ఈనెల 18వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తిరుపతిలో జరగబోవు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొంటాయి.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పెద్దకొమిర(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం గంపలగూడెం మండలం పెద్దకొమిరలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎలిమెంటరీ స్కూలు ఆవరణలో క్యాంప్ జరుగుతుందని పేర్కొన్నారు.

తుక్కులూరులో..

నూజివీడు: మండలంలోని తుక్కులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ఆవరణలో నిర్వహించనున్న ఈ వైద్యశిబిరాన్ని ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై 'చేరువ'తో అవగాహన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సోషల్ మీడియా, సైబర్ నేరాలపై పోలీసు శాఖకు చెందిన చేరువ వాహనం ద్వారా పోలీసులు అవగాహన కల్పించారు. చేరువ వాహనంలోని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ఏ విధంగా నేరాలు జరుగుతాయో వాటి నుంచి ఏ విధంగా జాగ్రత్తగా ఉండాల్లో పోలీసు శాఖ చిన్నచిన్న నాటికల ద్వారా వివరించారు. పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలనే అంశాలపై సూచనలందించారు. వాటితో పాటుగా చిన్నారులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలను సైతం ఈ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రథం సెంటర్, కనకదుర్గానగర్ ప్రాంతాల్లో పాదచారులు ఆసక్తిగా తిలకించారు.

అంబేడ్కర్ ఎవరిమీద ఆధారపడలేదు

విస్సన్నపేట: ప్రపంచ మేధావిగా పేరు గాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎవరి దయా దాక్షిణ్యాలమీద ఆధారపడలేదని తిరువూరు నియోజకవర్గ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బడుగు భాస్కరరావు అన్నారు. ఇటీవల ఒక నాయకుడు మాట్లాడిన మాటలను ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడుతూ ఎవరినో పొగడటం కోసం అంబేడ్కర్‌ను తగ్గించాల్సిన పనిలేదన్నారు. అంబేడ్కర్ పుట్టిన రోజు ఏప్రియల్ 14న విజ్ఞాన దివాస్ గా ఐక్యరాజ్యసమితి జరుపుకుంటుందని పేర్కొన్నారు. అక్షరం ఉన్నంత కాలం అంబేడ్కర్ ఉంటారు, అనగారిన వర్గాలకు అక్షరాయుధమై వెలుగుతారి తెలిపారు.

గ్రామాల్లో రహదారుల అభివృద్ధి

ఎమ్మెల్యే రక్షణనిధి



ఊటుకూరులో జలజీవన్ మిషన్ పథకం పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఊటుకూరు/గాదెవారిగూడెం(గంపలగూడెం): గ్రామాల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు పలు అంతర్గత రోడ్లతో సిమెంట్ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో గంపలగూడెం మండలం గాదెవారిగూడెంలో రూ.10లక్షలతో, ఊటుకూరులో రూ.30లక్షలతో నిర్మించనున్న సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఊటుకూరులో రూ. 42.55 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం అమల్లో భాగంగా పైపులైన్ ఏర్పాటు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన రహదారి సమస్యల పరిష్కారం కోసం ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి సిమెంట్‌రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నూరుశాతం తాగునీటి సరఫరాలో భాగంగా జలజీవన్ మిషన్ పథకంలో ఊటుకూరులో తాగునీటి సరఫరాకు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కే శామ్యూల్, ఊటుకూరు సొసైటీ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు బొల్లెపోగు రేణుక, చెన్నా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు సునీత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు జి చెన్నకేశవరెడ్డి, సీహెచ్ నర్సారెడ్డి, శ్రీనివాసరావు, కరుణాకర్‌రావు, రాఘవయ్య, ఉమామహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్వామినాయక్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఉపాధి హామీ సభలు

తిరువూరురూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభలు జరిగాయి. అక్కపాలెం, జీకొత్తూరు గ్రామాల్లో నిర్వహించిన ఈ సభల్లో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఎన్ఆర్ఈజీఎస్ కూలీలకు ఉపాధి కల్పన, పనుల నిర్వహణలో నిబంధనలను పంచాయతీ కార్యదర్శి రంగారావు వివరించారు. సర్పంచ్‌లు వేమూరి రవి, శీలం వెంకటరావమ్మ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

చాట్రాయి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని జనార్దనవరం, చాట్రాయి హైస్కూల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మి, ఎంఈఓ బ్రహ్మచారి పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నూజివీడు: పట్టణంలోని శ్రీ కోట మహిషమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.1,20,765 వచ్చినట్లు యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో హుండీ కానుకలను లెక్కించారు. రెండు నెలల 15 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చింది. ఈఓ డి.ప్రకృతాంబ పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులో ఆలయ అర్చకులతో పాటు భక్తులు పాల్గొన్నారు.